# వేలం సరుకు



వీధిలోకి బార్లాతీసిన తలుపులు. ద్వారానికి ఇరుపక్కలా విచ్చుకున్న రెండు కిటికీలు, చిన్న మేజాముందు ఒక కన్ను భూతద్దంలో, మరోకన్ను బజార్లో నడిచే జనంమీద వేసి గడియారాలు బాగుచేస్తున్నాడు చలపతి. అతన్నందరూ గడియారాల చలపతి అంటారు. అతని చుట్టూ ముళ్ళు విరిగిన, ఆగిపోయిన గడియారాలు చిన్నవీ, పెద్దవీ. పైన వేలంపాటలో కొన్న గుడ్డ పంకా, దాని

తాడు పక్కగదిలో కొడుకు చేతిలో.

"ఒరే చిన్నా పంకా లాగు."

పైన గుడ్డపంకా ఆడుతుంటే చల్లగా ఉంది చలపతికి. ఆ పంకా కోర్టు సామాను వేలం వేస్తుంటే కొన్నాడు. ఆ పంకాకింద, గడియారం సామాన్ల మధ్య కూర్చుంటే కోర్టులో జడ్జీగారి ఠీవి తెచ్చుకున్నాడు చలపతి. ఆ సంబరంతో 'చెల్లియో చెల్లకో' నాటకం పద్యం అందుకున్నాడు. సంతోషం వచ్చినప్పుడల్లా పద్యం అందుకుంటాడు. వీధిలో ఓ మనిషి కన్పిస్తే పద్యం టక్కున ఆగింది.

"ఎవరా పోయేది సుబ్బయ్యేనా?" అడిగాడు చలపతి.

"అయ్యా"

"ఫాక్టరీలో పనికేనా పోతున్నావ్!"

"అయ్యా"

"ఏం పని చేస్తావ్?"

"టైం ప్రకారం బొగ్గెయ్యాలండయ్యా"

"అయితే ఇట్రా ఈ గడియారం పెట్టుకో."

"బాబ్బాబు" దడిసిపోయాడు. 'సుబ్బయ్యా పర్లేదు పెట్టుకో' అంటూ తనే తొడిగాడు చలపతి. 'ముల్లు కదులుతోందా చూడు'. తలూపాడు సుబ్బయ్య "చెవి దగ్గర పెట్టుకో. మోగుతుందా చూడు."

మళ్ళీ తలూపాడు సుబ్బయ్య.

ఫో పెట్టుకెళ్ళు. వారానికి అర్ధరూపాయివ్వు.

నోరెళ్ళబెట్టాడు సుబ్బయ్య.

ఫో....... ఇంకా నుంచుంటావే.......టైం ప్రకారం బొగ్గేసుకో........ఫో తరిమేశాడు చలపతి.

ఇదీ వరస. రిపేరుకొచ్చిన గడియారాలు ఇలా కూలీలకు, బడి పంతుళ్ళకు, స్టూడెంట్లకు, దర్జీలకు. పెళ్ళి చూపులకెళ్ళే వాళ్ళకు అద్దెల కిచ్చేవాడు. గడియారం సొంతదారు వచ్చినప్పుడే వస్తుంది చిక్కు. అల్లాంటి అనేక సొంతదార్లలో ఒకడయిన పుల్లయ్య గుమ్మంలో అడుగుపెడ్తూనే "ఏందయ్యా ! నెలరోజుల్నించి తిప్పుతున్నావ్ నా గడియాలమయ్యా,"

"కూర్చో పుల్లయ్యా ! అరే చిన్నా ! పంకా ! ఈ సామాన్లన్నీ విప్పి కిరసనాయిల్లో వేశానా? మళ్ళీ లెక్క తప్పకుండా అతకాలంటే ఎంత శ్రమ.... ఎంత టైం...."ఇంతలో ఎల్లయ్య దూసుకొచ్చి "రెణ్ణెల్లనించి తిప్పుతున్నావ్. నా గడియారం నాకు పారెయ్యవయ్యా పోతాను. " అన్నాడు.

"ఎల్లయ్యా రిపేరంటే సామాన్యమా.... ఈ పుల్లయ్య జూడు దగ్గరుండి చేయించుకుంటున్నాడు. నీ కంత అవసరమైతే ఈ గడియారం పెట్టుకో..... పెట్టు ముల్లు తిరుగుతోందా ..... చెవిదగ్గరపెట్టు. మోగుతోందా.....పో తీసి కెళ్ళిపో " అని పంపించేశాడు ఎల్లయ్యని.

పదడుగులు వెళ్ళాడో లేదో ఎల్లయ్య బర్రున పరుగెత్తుకొచ్చి 'బాబోయ్! ఇది అడ్డం లేదు' అన్నాడు. చలపతి గడియారాన్ని ఒక్క చరుపు చరిచి 'బజార్లో నీకు టైంతో పనేముందయ్యా. ఇంటికెళ్ళి, చెవిదగ్గర పెట్టి చూడు. గంట మోగినట్టు మోగుతుంది' అని పంపించేశాడు.

ఇంతలో సుబ్బరామయ్య వచ్చి 'చలపతీ! గడియారానికి కీ రాడ్ పోయింది. నాలుగురూపాయలవుతుందిట. తెప్పించి వెయ్యి' అన్నాడు. సుబ్బరామయ్యని ఎగాదిగా చూసి గడియారం డెస్కులో వేసి 'కంపెనీ నుంచి సామాను తెప్పించడమా ! ఛీ ! మనం తయారుచేసి వేస్తాం. గడియారం పోయినా కీరాడ్ పోదు .... వెళ్ళండి.' అని మధ్యాహ్నం అవడంతో దుకాణం మూసేశాడు.

భోజనం ముగించి బయటకొచ్చేసరికి పెద్దగా వీరయ్య కేకలేస్తున్నాడు. "ఒరేయ్!

చలపతీ ! ఆర్నెల్లయి గడియారం తీసుకొని రోజూ తిప్పుతున్నావు.అది మా అత్తోరు కార్యం రోజు పెట్టిన గడియారం. రోజూ పెళ్ళాం చేత తిట్లు, బామ్మర్దుల దెప్పిళ్ళు, అత్తమామల గుసాయింపులు. ఒరేయ్ ! ఇయ్యాళ గడియారం ఇయ్యకపోతే నెత్తురు కళ్ళ జూస్తా.....రా రొరేయ్....."

చలపతి అర్ధ గుడ్డతో వీధిలోకొచ్చి "ఏందే ! ఇది గడియారం రిపేరా కట్టెలు కొట్టడవా ...... టైం పడ్తది పో". అన్నాడు.

కడుపు మండిన వీరయ్య మిట్టమధ్యాహ్నాన కోపం ఆపుకోలేక 'ఫెఢేల్' మని కొట్టాడు చలపతిని. ఆ దెబ్బతో దుమ్ములో పడ్డాడు చలపతి. వీరయ్య కసి తీరా అటూ ఇటూ కుమ్మి గడియారం ఆశ వొదులుకుని అమ్మలక్కలు తిట్టుకుంటూ పోతున్నా దుమ్ములోంచి చలపతి చెంగున లేచి 'ఒసే లంజముండా .... .... నా కాకీ నిక్కరివ్వవే.... ....' అని పెళ్ళాన్ని పిలిచి.... .... కాకీ నిక్కరేసుకోలేదని గదరా కొట్టావ్ .... అంటూ ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి కాకీ నిక్కరేసుకొచ్చి "ఒరే నాయాలా .... ఇప్పుడు రారా.... కాకీ నిక్కరేసుకొచ్చాను. రారొరేయ్" అంటూ తొడలు చరిచి, జబ్బలు గుద్దుకున్నాడు. అప్పటికే వీరయ్య వెళ్ళిపోయాడు.

చలపతి, ఆ కాకీ నిక్కరు పోలీసు దుస్తులు వేలం వేసినప్పుడు కొన్నాడు. అదేసుకుంటే తనకి తిరుగులేదని గట్టి నమ్మకం.

తెల్లవారకుండానే పట్నం నుంచి జనం వచ్చి చలపతి ఇంట్లో ప్రవేశించి గడియారం సామాన్లు, చెంబూ తెప్పాలా వీధిలో వేసి పట్టుకుపోతుంటే కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయింది అతనికి. గడియారం సామాన్లు వేలం పాటలో ఇంకొకడిచేత కొనిపించాడు. ఆ అప్పుకింద తన సామానంతా జప్తయి పోతోంది.

గుడ్డపంకా లాగేస్తుంటే గుండె పీకినట్టయింది. 'హన్నా ! ఆ కాకీ నిక్కరువేసుకుని లేకపోబట్టి గదా ఇంత ఘోరం జరిగిపోయింది.' అని తల పట్టుకుని కూలబడ్డాడు చలపతి.*